ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

దోమల దండయాత్ర...

- వీధుల్లో తిరగలేరు..ఇళ్లలో ఉండలేరు - అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాలు, గ్రామాల్లో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. సాయంత్రం అయితే వీధుల్లో తిరగలేక, ఇళ్లలో ఉండలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు...

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కర్నూలు నగరపాలక సంస్థతో పాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మండలాల్లో దోమల నివారణ చర్యలు కనిపించడం లేదు. ప్రజారోగ్యానికి లక్షలు ఖర్చు చేస్తున్నా దాని ఫలితం కనిపించడం లేదు. దీంతో దోమల బెడదతో జనం బెంబేలెత్తిపోతున్నారు. పారిశుధ్య లోపం కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం కర్నూలు జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకూ 193 డెంగీ కేసులు నమోదయ్యాయి. నాలుగు మలేరియా కేసులు నమోదయ్యాయి. నంద్యాల జిల్లాలో 110 డెంగీ కేసులు నమోదయ్యాయి. రెండు మలేరియా కేసులు నమోదయ్యాయి. ఎలీసా టెస్టుల ద్వారా పాజిటివ్ వచ్చిన మాత్రమే అధికారులు డెంగీ కేసులుగా పరిగణిస్తున్నారు. అనధికారికంగా ఈ ఏడాది నమోదైన డెంగీ కేసులు వేలల్లో ఉన్నట్లు అంచనా. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 8వేల దాకా ప్రయివేటు, ప్రభుత్వ ఓపెన్ స్థలాలు ఉన్నాయి. వీటిలో 30 నుంచి 40 శాతం స్థలాలు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. చుట్టూ ఉన్న మురుగు నీటితో పాటు వర్షపు నీరు నిల్వ ఉండటంతో దోమల ఉత్పత్తికి కారణమవుతున్నాయి. ఇలాంటి స్థలాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. కనీసం యజమానులకు నోటీసులు కూడా జారీ చేయలేదు. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని 52 వార్డులు ఉన్నాయి. అన్ని వార్డుల్లో దోమలు రాజ్యమేలుతున్నాయి. చిన్న ప్రాణులైన దోమల ధాటికి జనం తల్లడిల్లిపోతున్నారు. తుంగభద్ర, హంద్రీ, వక్కేరువాగు నదులు సహా కెసి కాలువల్లో గుర్రపుడెక్క పెరిగిపోవడంతో ప్రమాదకరమైన దోమలు పెరిగిపోయాయి. సాయంత్రం 6 గంటలు దాటితే వీధుల్లో తిరగడానికి, ఇళ్లలో ఉండటానికి వీలు కావడం లేదు. మాన్సోనియా, క్యూలెక్స్ వంటి దోమలు ఊహించని స్థాయిలో వృద్ధి చెందాయి. వీటికి తోడు చెత్తా చెదారం నిండిపోయిన మురుగు కాల్వల నుంచి, చెత్త కుప్పల మీది నుంచి గుంపులు గుంపులుగా దోమలు ప్రజలపై దాడి చేస్తున్నాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. దోమ కాటుతో శరీరం దద్దర్లు ఎక్కి ఇబ్బంది పడుతున్న వారు వేలల్లో ఉంటారు. దోమ జీవిత కాలం 25-30 రోజులు. నగరం మధ్యన, అనుకొని ప్రవహిస్తున్న తుంగభద్ర, హంద్రీ నదులు, వక్కేరువాగు, కెసి కాలువ మురుగు కూపాలుగా మారి దోమల వ్యాప్తికి నిలయాలయ్యాయి. నంద్యాల జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాలు కూడా దోమలకు నిలయంగా మారాయి. వీటితో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లోనూ చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. మురుగు కాలువలు, చెత్త కుప్పలు పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. గ్రామాల్లో ఫాగింగ్ చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దోమల నివారణకు ఉపయోగించే మలాథియన్, బ్లీచింగ్ పొడి, ఇతర రసాయనాల పేరుతో ఏటా లక్షలు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నా వీధుల్లో మాత్రం వాటిని వినియోగించిన దాఖలాలు కనిపించడం లేదు.

మురుగుమయమైన హంద్రీ

ప్రజల ఆరోగ్యాలను రక్షించాలి

దోమలు మనుషుల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్నాయి. దీంతో మలేరియా డెంగ్యూ వంటి విష జ్వరాలు వస్తున్నాయి. దోమల ఎక్కువ కావడంతో ప్రజల అభ్యర్ధన మేరకు నగరపాలక సంస్థ సిబ్బంది కాలువల్లో చెత్త తీయడం పైపైన చేస్తున్నారు. పూల బజార్, వాసవి కాలేజీ, గడియారం ఆస్పత్రి, ఉర్దూ గర్ల్స్ హై స్కూల్, అమ్మవారి శాల ప్రాంతాల్లో ఏడు అడుగుల లోతు కాలువలు ఉంటే కేవలం రెండు అడుగులు పైపైన పూడిక తీసి వెళ్తున్నారు. పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచి దోమల నివారణ చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాలను రక్షించాలి.

- ఎస్ఎండి.షరీఫ్, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు.

సాయంత్రమయితే తలుపులు మూసుకోవాలి

రెండు నెలలుగా దోమలు పట్టి పీడిస్తున్నాయి. పిల్లలు, పెద్దలు అనకుండా అందరికీ కుడుతున్నాయి. పిల్లలకు దద్దుర్లు వస్తున్నాయి. సాయంత్రం ఆరు అయితే దోమల భయంతో తలుపులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మా ప్రాంతంలో మూడు నెలలైనా కాలువల శుభ్రం చేయడం లేదు. పొగ వదలక నెల రోజులైంది. జెట్టు బిళ్ళలు, ఆలవుట్, గుడ్ నైట్ లాంటివి పెట్టినా దోమలు కుడుతూనే ఉన్నాయి. సచివాలయ ఉద్యోగులకు తెలిపినా ఏమాత్రం స్పందించడం లేదు. ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించాలి.

- సి.జయమ్మ, కావడి వీధి.

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జొహరాపురం పరిధిలోగల, వక్ఫ్ బోర్డు మసీదు బుడాన్ ఖాన్‌కు చెందిన, సర్వే నంబర్ 154 కి సంబంధించిన, స్థలాన్ని , మేయర్ బివై.రామయ్య తోపాటు మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు బోర్డు మాజీ డైరెక్టర్ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎ.సుభాన్, మాజీ మంత్రి మారెప్ప పేర్కొన్నారు. వెంటనే అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఆవాజ్ నగర కార్యదర్శి షేక్ మొహమ్మద్ షరీఫ్, అధ్యక్షతన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఎస్ఎ.సుభాన్, మూలింటి మారెప్ప మాట్లాడుతూ కర్నూలు నగరంలో నే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా మసీదు మాన్యాలు, దేవుని మాన్యాలు ,క్రిస్టియన్ సంస్థల ఆస్తులు తేడా లేకుండా రాజకీయ నాయకులు తమ పలుకుబడిని ఉపయోగించుకొని, అధికారులను తప్పుదారిపట్టించారన్నారు. చట్టాలలోని లోసుగులను ఆసరా చేసుకుని అధికారులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్నారు. రాజకీయ నాయకులకు ఆశచూపి ప్రజా ధనాన్ని ఆస్తులను తెగనమ్మి కబ్జాలు చేశారన్నారు. చట్ట పరంగా ఎటువంటి అమ్మడం,కొనడం చెల్లదని తెలిసినప్పటికీ అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై, సర్వే నంబర్లను తారుమారు చేసి భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. సబ్ రిజిస్టార్ ప్రవీణ్ కుమార్‌ను సస్పెండ్ చేశారన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దుచేయాలని, రిజిస్టేషన్ చేసిన అధికారులపై చేయించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆవాజ్ కమిటీ నగర అధ్యక్షులు పి ఎక్బాల్ హుస్సేన్ మాట్లాడారు. ఈ ధర్నా లో ఆవాజ్ న్యూ సిటీ కార్యదర్శి మొహమ్మద్ రఫీ, ఆవాజ్ నగర ఉపాధ్యక్షులు ,చోటు భాయ్ ఇలియాజ్ ,ఇంతియాజ్, మహబూబ్ బాషా, జమాతే ఇస్లామే హింద్ నాయకులు చాంద్ బాషా , మూసామియా, షేక్ నూర్ వలి ,ఇర్ఫాన్ బాష, ఖలీల్, గౌస్ బాషా, ఇస్మాయిల్ రిటైర్డ్ టీచర్ చాన్ బాష, అబ్దుల్ రహమాన్, ఇమామ్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఏజస్ బాషా,రియాజ్ బాష , మాలిక్ బాషా, అన్వర్ బాషా పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ఒకేరోజు 100 శాతం పూర్తి

- సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం

- మండల ప్రత్యేక అధికారి రమణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆగస్టు నెలకు సంబంధించి సామాజిక భద్రత పింఛన్లను ఒకటవ తేదీననే 100 శాతం పంపిణీ పూర్తి చేయాలని కల్లూరు మండల ప్రత్యేక అధికారి పివి రమణ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. సోమవారం కల్లూరు ఎంపిడిఒ కార్యాలయ సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన సామాజిక భద్రత పింఛన్ల పంపిణీపై సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి పివి.రమణ మాట్లాడుతూ మండలంలోని 19 సచివాలయ పరిధిలో 8318 సామాజిక భద్రత పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని వారికి రూ.3, 50, 46 500 మొత్తం నగదు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. పింఛన్లు మ్యాపింగ్ చేసిన ఉద్యోగులు ఉదయం ఐదున్నర గంటలకు వెళ్లి ఆరు గంటల సమయానికి పింఛన్ల పంపిణీ ప్రారంభించి 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. పింఛన్ల పంపిణీ విధి విధానాలు, పారిశుధ్యం, తాగునీరు, ప్రజా సమస్యల పరిష్కారంపై సమీక్షించారు. ఇఒపిఆర్‌డి రవి కిషోర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమణ

1 నుంచి నీటి విడుదల

- కర్నూలులో కృష్ణా యాజమాన్య బోర్డు

- నీటి పారుదల సలహా మండలి సమావేశం తీర్మానం

- ప్రాజెక్టులన్నింటినీ తక్షణమే నింపండి : మంత్రులు ఫరూక్, బీసీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆగష్టు 1 నుండి తెలుగుగంగ, ఎస్ఆర్‌బిసి ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని, కర్నూలులోనే కృష్ణా యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయాలని నీటి పారుదల సలహా మండలి సమావేశం తీర్మానించింది. సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధ్యక్షతన జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి ఖరీఫ్ పంటలకు గాను తెలుగు గంగ పథకం కింద ఆగస్టు ఒకటో తేదీ నుండి వెయ్యి క్యూసెక్కుల నీటిని వరి నాట్ల కోసం విడుదల చేస్తూ రోజురోజుకు పెంచుకుంటూ స్థిరీకరించి ఆయకట్టుకు నీటిని విడుదల చేసేందుకు తీర్మానించారు. ఎస్ఆర్‌బిసి కాలువ ద్వారా ఆగస్టు ఒకటి నుండి 1 లక్ష 13 వేల ఎకరాలకు, కెసి కాలువ కింద 1,75,388 ఎకరాలకు నీరు ఇవ్వాలని తీర్మానం చేశారు. శివభాష్యం ప్రాజెక్టు కింద 8 వేల ఎకరాలకు ప్రాజెక్టులో నీరు చేరిన వెంటనే విడుదల చేసేందుకు తీర్మానించారు. తుంగభద్ర నదిపై గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. అనంతరం రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిలు మాట్లాడుతూ కృష్ణా, తుంగభద్ర నదుల నుండి వచ్చే వరద జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ నీటితో నింపేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శ్రీశైల జలాశయం వెనుక జలాలను సమర్ధవంతంగా వినియోగించుకునేందుకు తెలుగంగ, ఎస్ఆర్‌బిసి, కెసి కాలువ, హెచ్ఎన్ఎస్ఎస్, చిన్న నీటి వనరులు తదితర ప్రాజెక్టులు నిర్దేశించిన సామర్ధ్యంతో ప్రవహించేందుకు తక్షణ మరమ్మతుల కు అత్యవసరమైన నిధుల కేటాయింపు ప్రతిపాదనలను ఇవ్వాలని కోరారు. కాలువల ద్వారా నీటి ప్రవాహాలకు కావాల్సిన అనుమతులను ప్రభుత్వం నుండి వెంటనే ఇప్పించేందుకు తాము కృషి చేస్తామని మంత్రులు తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 55 వేల క్యూసెక్కులు డ్రా చేసుకునేందుకు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ శాసనసభ్యులు, రైతులు, సాగునీటి సంఘాల సభ్యులు, మంత్రులు తీర్మానించిన అంశాలను ప్రభుత్వానికి పంపించి తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా అన్ని రిజర్వాయర్లను నింపేందుకు సంబంధిత అధికారులతో పర్యవేక్షిస్తానన్నారు. డోన్, పాణ్యం, ఆత్మకూరు, నందికొట్కూరు శాసనసభ్యులు జయ సూర్య ప్రకాష్ రెడ్డి, గౌరు చరిత, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, గిత్త జయ సూర్య, కడప జిల్లా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులు, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది నారాయణ రెడ్డి, నంద్యాల జేసీ సి.విష్ణు చరణ్, కడప జేసీ అధితిసింగ్, కర్నూలు, నంద్యాల జిల్లాల ఇరిగేషన్ ఎస్ఇలు రెడ్డిశేఖర్‌రెడ్డి, వెంకటరమణ, ఆర్డీవోలు మల్లికార్జునరెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎం.దాసు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, వేదికపై మంత్రి ఫరూక్, కలెక్టర్, ఎమ్మెల్యేలు, అధికారులు

పాఠశాలల్లో ఒకే సిలబస్ ఉండాలి

డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలో ఒకే సిలబస్ ఒకే పరీక్ష విధానం అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటిలు డిమాండ్ చేశారు. సోమవారం డిఇఒ కె.శామ్యూల్‌కు యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ వివిధ మేనేజ్‌మెంట్లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. పెరిగిన పనిభారంతో పాటు సమస్యలు పరిష్కారం కాక ఉపాధ్యాయులు అసంతృప్తితో ఉనారన్నారు. జిఒ 117 రద్దు చేసి జిఒ ఎంఎస్ నం.55, తేదీ, 23.04.2021 ప్రకారం కేటాయించాలన్నారు. ప్రీప్రైమరితో బాటు 1 నుండి 5తరగతులను ఒకే పాఠశాలగా నడపాలన్నారు. హైస్కూళ్లలో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి మినహాయించి పనిభారం తగ్గించాలన్నారు. హైస్కూళ్లలో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలన్నారు. ఒక కిలోమీటర్ పైబడి దూరం నుండి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. స్థానిక ప్రాంతాల పరిస్థితులను బట్టి మధ్యాహ్న భోజన పథకం మెనూ సవరించాలన్నారు. మినిమమ్ టైంస్కేల్ ఉపాధ్యాయుల సర్వీస్‌లను రెగ్యులరైజ్ చేయాలన్నారు. జిల్లాసహా అధ్యక్షులు హేమంత్ కుమార్, యెహోషువ, జిల్లా కార్యదర్శి తిమ్మన్న, కర్నూలు మండల ప్రధాన కార్యదర్శి సోమన్న, రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, ఎమ్మిగనూరు అధ్యక్షులు లతీఫ్, వెల్దుర్తి ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రఫీ, మారెప్ప, అనిల్ కుమార్, హనుమన్న, మార్క్ పాల్గొన్నారు.



జిఒ117ను రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి- సి బెళగల్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుండా పక్కదోవ పట్టించేందుకు అమలు లోకి తెచ్చిన జిఒ 117 ను వెంటనే రద్దు పరచాలని యుటిఎఫ్ మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం తహసీల్దార్ అనుపమకు, ఎంపిడిఒ శకుంతలకు, ఎంఇఒ-2 ఆడమ్ బాషకుకు వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎటి తిమ్మన్న, హనుమంతు, మండల అధ్యక్షులు అనుమన్న , మండల కార్యదర్శి మనోజ్ కుమార్, మండల నాయకులు కిషోర్, శుభానందరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు రాకపోతే షోకాజ్ నోటీస్

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ఏ అధికారైన గ్రీవెన్స్‌కు రాకపోతే వెంటనే సంబంధిత అధికారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా డిఆర్ఒను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్-పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక చాలా ముఖ్యమైన కార్యక్రమమని, సమస్యలు పరిష్కారానికి ప్రజలు ఇక్కడకు వస్తారన్నారు. జిల్లా అధికారులు తప్పనిసరిగా ఇక్కడ ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారాన్ని అధికారులు సీరియస్ గా తీసుకోవాలన్నారు. జిల్లా అధికారుల స్థానంలో కింది స్థాయి సిబ్బంది హాజరు కాకూడదని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ముందుగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు హాజరు అయ్యారా లేదా అని జిల్లా కలెక్టర్ స్వయంగా శాఖల వారీగా అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమానికి హాజరు కాని అధికారులకు షోకాజ్‌నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఒకవేళ అధికారులు సెలవులో వెళ్లాలనుకుంటే ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. అలాగే హెడ్ క్వార్టర్స్ వదలి వెళ్లాలనుకుంటే కూడా అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఉ.10:30గం.ల కల్లా అధికారులు హాజరు కావాలన్నారు.

ఉదయం 6.గం.లకే పెన్షన్ పంపిణీ

పెన్షన్లకు సంబంధించి ఆగస్టు 1న ఉ.6.గం.లకే పెన్షన్ పంపిణీ ప్రక్రియను ప్రారంభించాలని కలెక్టర్ మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. పెన్షన్ పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేందుకు సచివాలయాల సిబ్బందికి ఒక్కొక్కరికి 50 ఇళ్లు మ్యాపింగ్ చేశామన్నారు. అంతకంటే ఎక్కువగా ఉంటే మండలాల్లో ఉన్న ఇతర శాఖల సిబ్బందికి మ్యాప్ చేయాలన్నారు. పెన్షన్ పంపిణీ మొత్తం ఒకటవ తేదీనే పూర్తి కావాలన్నారు. ఊళ్ళో లేనివారు, ఏమైనా టెక్నికల్ సమస్యలు ఉంటే తప్ప మిగిలినవన్నీ పంపిణీ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. పెన్షన్ పంపిణీలో సిబ్బంది కొరత లేకుండా జిల్లా పరిషత్ సిఇఒ, పిడి డిఆర్‌డిఎ చర్యలు తీసుకోవాలన్నారు. ఫించన్ల పంపిణీపై స్పెషల్ ఆఫీసర్లు ఎంపిడిఒలు, సిబ్బందితో సమీక్ష నిర్వహించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. డిఆర్ఒ మధుసూదన్ రావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వెలగని విద్యుత్ దీపాలు

హైవేపై వాహనదారులకు, ప్రజలకు ఇబ్బంది

పట్టించుకోని హైవే, మునిసిపల్ అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలోని హంద్రీ బ్రిడ్జి నుండి మొదలుకొని షరీఫ్ నగర్ ఓవర్ బ్రిడ్జి వరకు హైవేపై ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు, ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డు లైన్‌లోని విద్యుత్ దీపాలు వెలగడం లేదు. దీంతో వచ్చిపోయే రహదారులు రెండూ చీకటి కమ్ముకుని అంధకారం ఏర్పడింది. 44వ ఎన్‌హెచ్‌పై ప్రతిరోజు వందలాది వాహనాలు రాకపోకలు కొనసా గిస్తున్నాయి. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా శాఖ హైవే రోడ్డుపై రెండు వైపులా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం కర్నూలు నగరం హంద్రీ నది బ్రిడ్జి వద్ద నుంచి కృష్ణానగర్ మీదుగా షరీఫ్‌నగర్‌కు వెళ్లే దారిలో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై విద్యుత్తు దీపాలు నెల రోజులకు పైగా వెలగడం లేదు. దీంతో ఈ రహదారి అంధకారంతో నిండిపోయింది. అటుగా వచ్చే వాహనాలకు ఎదురుగా ఏ వాహనం వస్తుందో స్పష్టంగా కనిపించే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో వాహనాలు ప్రమాదాలకు నిలయంగా మారింది. గతంలోనూ ఇదే పరిస్థితి ఉండడంతో సరిగ్గా ఇదే దారిలోనే చోటు చేసుకున్న మూడు ప్రమాదాల్లో ఒక ఆటో డ్రైవరు, ఒక మహిళ, మరో యువకుడు ప్రాణాలు కోల్పోయారు. వీటికి అదనంగా చాలా ప్రమాదాలు జరిగి కాళ్లు చేతులు విరిగిన పరిస్థితులు కూడా ఉన్నాయి. దీనికి తోడు ఈ హైవేను అనుకొని ఉన్న సర్వీస్ రోడ్డు లో ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలు కూడా ఏమాత్రం వెలగడం లేదు. వీటిని చక్కదిద్దడంలో మునిసిపల్ అధికారులు కూడా పూర్తిగా విఫలమవుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు పాదచారులు చీకటి పడిందంటే అటుగా వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై హైవే అధికారులు, మునిసిపల్ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ దీపాలను వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

రాక పోకలకు ఇబ్బంది : హైవే తోపాటు, సర్వీస్ రోడ్డులో నెల రోజులకు పైగా విద్యుత్ దీపాలు వెలగడం లేదు. రోడ్డు చిమ్మ చీకటిగా మారింది. పట్టించుకున్న నాథుడే లేడు.

- సురేష్, స్థానికుడు షరీఫ్ నగర్

విద్యుపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి

విద్యుత్ దీపాలు వెలగకపోవడం కారణంగా ప్రజలు రోడ్లపైకి వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. పనుల కోసం బయటకు వచ్చినవారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఏకంగా ప్రాణాలే కోల్పోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం దీనికి కారణం. అధికారులు వెంటనే స్పందించి విద్యుత్తు దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

- ఏసన్న సిపిఎం, షరీఫ్ నగర్.

హెవీ లోడ్ కారణంగా సమస్య...

విద్యుత్తు హెవీ రోడ్ సమస్య కారణంగా లైట్లు ఫెయిల్ అవుతున్నాయి. దీని పరిష్కారం కోసం నూతనంగా ట్రాన్స్‌ఫార్మరును ఏర్పాటు చేయాల్సి ఉంది. రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

తరుణ్ కుమార్, పిడి, నేషనల్ హైవే - 44,

భవిష్యత్ తరాలకు అందించే గొప్ప బహుమతి

సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అడిషనల్ డిజి రాజేంద్ర చౌధురి

సెయింట్ జోసఫ్స్‌లో అమ్మ పేరిట ఒక మొక్క

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మొక్కలు నాటి కాపాడటం భవిష్యత్తు తరాలకు అందించే గొప్పబహుమతి అని, తద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌధురి తెలిపారు. సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, క్షేత్ర కార్యాలయం, కర్నూలు ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కాలేజీలో అమ్మ పేరిట ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన చౌధురి, కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థుల చేత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కర్నూలు ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రామ్ హెడ్‌డి. మురళి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణంతో కూడిన భూమిని అందించటం మనందరి బాధ్యతగా గుర్తించాలని పేర్కొన్నారు. పర్యావరణం-ప్రగతిని సమన్వయం చేసుకుని ముందుకు సాగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. ఈ దిశగా విద్యార్థులంతా అమ్మ పేరిట ఒక మొక్క స్ఫూర్తిని వ్యాప్తి చేయటంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శాంత, సెంట్రల్ బ్యూర్ ఆఫ్ కమ్యూనికేషన్ కార్యాలయ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు,బోధనేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలపై దృష్టి సారించండి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

హాస్టల్లో నాణ్యమైన భోజనంతోపాటు విద్యార్థులకు తాగునీరు లాంటి సమస్యలు ఉన్నాయని వెంటనే వాటిని పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నవర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అమర్ సాయి, ఉదయ్ జిల్లా కలెక్టర్ ను కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు.నగరంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలలో , కళాశాలలో సంక్షేమ హాస్టల్లో సమస్యలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారుజ భోజనం నాణ్యత పాటించకపోవడం, తాగునీరు కలుషితంగా ఉండడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేక చదువుకోవడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు.

వ్యవసాయ కార్మికులకు
సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

గ్రామీణ పేదలకు, వ్యవసాయ కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ కోరారు. సోమవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో వ్యకాస జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కెవి.నారాయణ మాట్లాడారు. రెక్కల కష్టం మీద బతికే గ్రామీణ పేద కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరయిన ప్రోత్సాహం లేదని తెలిపారు. మూడు పూటల తిండి లేని కుటుంబాలు అనేకం ఉన్నాయని, అలాంటి వారి కోసం ఉన్న ఆహారభద్రత చట్టానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అందుకోసం ప్రజా పంపిణీని బలోపేతం చేసి 14 రకాల నిత్యావసర వస్తువులు అందించాలని కోరారు. వ్యవసాయ కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, దాని ద్వారా ప్రతి పేద కుటుంబమూ బాగుపడుతుందని తెలిపారు. వ్యవసాయ కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యకా జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, ఈ.తిక్కన్న, రామాంజనేయులు, బి.బాలకృష్ణ, బి.నాగన్న, ఎస్.తిమ్మన్న, శ్రీరాములు పాల్గొన్నారు.

గురురాఘవేంద్ర ప్రాజెక్టు స్టేజ్-1
పంపు హౌస్ ధ్వంసం
- డీఎస్పీ శివ నారాయణ మూర్తి పరిశీలన

ప్రజాశక్తి - మంత్రాలయం

సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మండలంలోని మాధవరం గ్రామ సమీపంలో ఉన్న గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం స్టేజ్-1 పంపు హౌస్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. డీఎస్పీ శివ నారాయణమూర్తి సోమవారం పంప్ హౌస్‌కు చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండు, మూడు రోజుల క్రితం గురు రాఘవేంద్ర ప్రాజెక్టు స్టేజ్-1 పంపు హౌస్ ఎత్తిపోతల పథకాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారని తెలిపారు. మంత్రాలయం, కోసిగి మండలాల్లోని ఐదు గ్రామాల్లో సుమారు 4,200 ఎకరాలకు సాగునీటి సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. స్టార్టర్లు, బ్రేకర్లు, ఇన్ఫ్‌ఫీలేటర్లను ధ్వంసం చేసి చెల్లాచదురుగా పడేశారని తెలిపారు. ధ్వంసమైన ఫర్నీచర్ విలువ దాదాపు రూ.9.5 లక్షలు ఉంటుందని అంచనా వేశారని పేర్కొన్నారు. ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాజకీయ కక్ష సాధింపు కారణంగా ఎవరైనా చేశారా లేక దొంగలు చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గతేడాది ఫిబ్రవరిలో ఇలాంటి ఘటన జరిగిందని, కానీ దొంగిలించేదుకు ప్రయత్నం చేశారని అధికారులు పోలీసులకు తెలిపారు. తుంగభద్రకు భారీగా వరద నీరు రావడంతో నీటిని పంపింగ్ చేసేందుకు ఈనెల 24 పంపు తాళం తీసి చూశామని, అప్పుడు ఫర్నీచర్ బాగుందని అధికారులు వివరించారు.

అనుమానిత డెంగీ కేసుపై విచారణ

ప్రజాశక్తి - గోనెగండ్ల

లార్వాలను పరిశీలిస్తున్న అధికారులు

గోనెగండ్ల సచివాలయం-3 పరిధిలో అనుమానిత డెంగీ కేసులు వచ్చిన నేపథ్యంలో సోమవారం మలేరియా నివారణాధికారి సాయిబాబా వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది విచారణ చేపట్టారు. సచివాలయ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి లార్వాను, నీరు నిల్వ ఉన్న డ్రమ్ములను, గచ్చులను పరిశీలించారు. ఆ ప్రాంతంలో దోమల నివారణకు స్ప్రేయింగ్ చేయించారు. అనుమానిత ఇంట్లో ఎవరికైనా జ్వరాలు వచ్చాయా అని విచారించారు. వారికి రక్త పరీక్షలు చేసి వైరల్ ఫీవర్‌గా నిర్ధారించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మెడికల్ ల్యాబ్‌ను పరిశీలించి, ఎఎన్ఎంలు రక్త నమూనాలను వారానికి రెండుసార్లు ఇచ్చేటట్లు చూడాలని సూపర్‌వైజర్‌కు, ల్యాబ్ టెక్నీషియన్లకు సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ వచ్చిన రక్త పూతలను వెంటనే పరీక్ష చేసి రోగులకు ట్రీట్‌మెంట్ అందించాలని తెలిపారు. సూపర్‌వైజర్లు హనుమంతు, సుధాకర్, ఎఎన్ఎం ప్రమీల, మాధవి పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

- ఎంపిడిఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - నందవరం

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలను తీసుకోవాలని యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు, జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.దావీదు, దేవపాల్, జె.ఎల్లప్ప డిమాండ్ చేశారు. సోమవారం నందవరంలోని ఎంపిడిఒ కిరణ్ మోహన్ రావు, తహశీల్దార్ ఓబులేసు, ఎంఇఒలు రామాంజనేయులు, రఘునాథ్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట రాముడు, నీలి నాగరాజు మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను విచ్ఛిన్నం చేస్తూ తీసుకొచ్చిన జిఒ 117ను రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలలను 1 నుంచి 5వ తరగతి వరకు యథావిధిగా కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలో ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానం ఉండాలని, హైస్కూళ్లలో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. మండల సీనియర్ నాయకులు దుబ్బన్న, నాయకులు తలారి నాగరాజు, ఇస్సాక్ పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ వీరశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి.గాది లింగప్ప, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రామాంజినేయులు, మల్లికార్జున, నాయకులు రుద్రముని, ఉరుకుందయ్య, కృష్ణుడు, వెంకటరమణ పాల్గొన్నారు. **దేవనకొండ** తహశీల్దార్ ఈశ్వరయ్య, ఇఒఆర్‌డి సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. యుటిఎఫ్ జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువా, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు లక్ష్మణ్, మద్దిలేటి, మధు మాట్లాడారు.

నందవరం ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సమయపాలన పాటించని సిబ్బంది

- సెలవుల్లో డిజిటల్ అసిస్టెంట్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

పెద్దకడబూరులోని సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఉదయం 10.30 గంటలైనా సచివాలయ తలుపులు తెరవ లేదు. పనుల కోసం వచ్చిన ప్రజలు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. పెద్దకడబూరులో రెండు సచివాలయాలు ఉన్నాయి. రెండు సచివాలయాల్లో పని చేసే డిజిటల్ అసిస్టెంట్లు ఇద్దరూ సెలవుల్లో ఉన్నారు. డిప్యూటేషన్ ఇద్దరిని నియమించినా సమయపాలన పాటించకపోడంతో కులధ్రువీకరణ పత్రాలు, భూమికి సంబంధించిన పత్రాల కోసం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు సర్వర్ సక్రమంగా పనిచేయక పోవడంతో రోజుల తరబడి పనులు మానుకుని సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ప్రజలకు అన్ని ప్రభుత్వ పనులను వేగవంతంగా జరగాలనే ఉద్దేశంతో గ్రామ సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చింది. కానీ ప్రజలకు కావాల్సిన చిన్న, చిన్న పనులు కూడా సక్రమంగా జరగక పోవటానికి సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం కారణమని, సచివాలయాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడమని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి సచివాలయాలపై పర్యవేక్షణ చేపట్టి ప్రజాసమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

నష్టపరిహారం చెల్లింపులో అన్యాయం

- సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

పంట నష్టపరిహారం మంజూరులో అన్యాయం జరిగిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పెద్దహరివాణం గ్రామానికి చెందిన రైతులు సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో తప్పిదాల వల్ల చాలా మంది రైతులు జాబితాలో పేరున్నా పరిహారం అందక నష్టపోయారని తెలిపారు. పెద్దహరివాణం సచివాలయ వ్యవసాయ అధికారి రికార్డులు తారుమారు చేసి రైతులకు నష్టపరిహారం రాకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్ట పరిహారం రాలేదని ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోలేదని తెలిపారు. సమస్యను పరిష్కరించి నష్ట పరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 2 వేల మందికి నష్టపరిహారం రావాల్సి ఉండగా కొంత మందికి పరిహారం చెల్లించారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విచారించి న్యాయం చేస్తామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు.

సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

పోటాపోటీగా కూరగాయల మార్కెట్ వేలం

- రూ.10 లక్షలకు దక్కించుకున్న ఈరన్న

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిణిగేరి గ్రామంలో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో సోమవారం కూరగాయల మార్కెట్ వేలం పాట పోటాపోటీగా సాగింది. సర్పంచి వెంకటేష్ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ వేలం పాటను నిర్వహించారు. ఈ వేలం పాటలో ఐదుగురు పాటదారులు పాల్గొన్నారు. చిన్నహోతూరు ఈరన్న రూ.10.02 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచి వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు నాగమణి, జంప్లా నాయక్, వీరేష్ మాట్లాడారు. పంచాయతీ తీర్మానం మేరకు గ్రామంలో ఉన్న దేవాలయాల అభివృద్ధి కోసం వేలం పాటలో వచ్చిన సగం నగదు రూ.5.01 లక్షలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన 50 శాతం పంచాయతీకి జమ చేస్తామన్నారు. గతంలో కంటే ఈఏడాది పంచాయతీకి రూ.1.82 లక్షలు అదనంగా ఆదాయం సమకూరిందని తెలిపారు. గ్రామ పెద్దలు భాస్కర్ రెడ్డి, శ్వేత వాహన్ రెడ్డి, శేషాద్రి నాయుడు, నారాయణ, వెంకటేష్, చిన్న రెడ్డి, నాగన్న, సోమన్న, భీమన్న, రామాంజినేయులు, తిక్కయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోటాపోటీగా వేలంపాట

ఆదోని : ఆదోని మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఝూన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ సుంకం వసూలుకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం ప్రక్రియ పోటాపోటీగా సాగింది. మార్చి 31, 2025 వరకు కాంట్రాక్టుదారులకు అవకాశం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. 8 నెలలకు గాను ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ రూ.61.21 లక్షలకు ఎమ్మెల్యే పార్థసారథి అనుచరుడైన వీరేష్ దక్కించుకున్నారు. రూ.42 లక్షల నుంచి ప్రారంభమైన వేలంపాట మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, గుడిసె ఆది కృష్ణమ్మ, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప, ఎమ్మెల్యే పార్థసారథి అనుచరుల మధ్య పోటాపోటీగా సాగింది. చివరకు రూ.61.21 లక్షలకు వీరేష్ దక్కించుకున్నారు. గతేడాది 12 నెలలకు గాను రూ.71 లక్షలకు వేలం పోయినట్లు అధికారులు తెలిపారు. ఎద్దుల సంత రూ.21.5 లక్షలకు రామాంజనేయులు దక్కించుకున్నారు. జీవాల సంత రూ.7.5 లక్షలకు అశ్వర్థ నారాయణ దిక్కంచుకున్నారు. గతేడాదితో పోలిస్తే మున్సిపాలిటీకి ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా టూ టౌన్ సిఐ గోపినాథ్, వన్ టౌన్ సిఐ తేజ, త్రీటౌన్ సిఐ నరసింహారాజు ఆధ్వర్యంలో ఎస్ఐలు శ్రీనివాసులు, ఎర్రి స్వామి పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

ఆస్పరిలో వేలం పాట నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

ఆదోనిలో వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

సామాజిక చైతన్య శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

- కెవిపిఎస్ మండల కార్యదర్శి రామకోటి హనుమంతు

ప్రజాశక్తి - కోసిగి

ఈనెల 30, 31న ఆదోని మండలం సంతేకుడ్లూరు గ్రామంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగే సామాజిక చైతన్య శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కెవిపిఎస్ మండల కార్యదర్శి రామకోటి హనుమంతు, సిఐటియు మండల కార్యదర్శి రాముడు కోరారు. సోమవారం కోసిగిలో జరిగిన కెవిపిఎస్ సమావేశంలో వారు మాట్లాడారు. అణగారిన సామాజిక తరగతులపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. అణగారిన తరగతులకు హక్కులు దక్కాలన్నా, అంబేద్కర్ ఆశయం నెరవేరాలన్నా దళితులంతా ఐక్యమవ్వాలని కోరారు. ఆ లక్ష్యంతోనే సామాజిక సమస్యలపై కెవిపిఎస్ పోరాడుతోందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా సామాజిక ఉద్యమకారులకు ఈనెల 30, 31న రెండు రోజులపాటు ఆదోని మండలం సంతేకుడ్లూరు గ్రామంలో సామాజిక ఉద్యమ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కెవిపిఎస్ మండల నాయకులు ఫిలిప్, ముక్కరన్న, బుజ్జన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

అనాథలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి -దేవనకొండ

హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన అనాథలైన ముగ్గురు బాలికలకు దేవనకొండ మండలానికి చెందిన సైనికులు సోమవారం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నెలరోజుల క్రితం తల్లిదండ్రులను కోల్పోయిన ఈ బాలికలు ఎటువంటి ఆధారం లేక బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్నారు. వీరికి దేవనకొండకు చెందిన తెర్నేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కె.ఉచ్చీరప్ప, సైనికులు రామాంజనేయులు, హరికృష్ణ, శ్రీకాంత్ ఆర్థిక సహాయం అందజేశారు.

హుండీ లెక్కింపు పూర్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో చేపట్టిన హుండీ లెక్కింపు ప్రక్రియ పూర్తయినట్లు శ్రీమఠం మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు హుండీలో వేసిన జులై నెల ఆదాయాన్ని లెక్కించామని తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా అధికారులు, శ్రీమఠం అధికారుల సమక్షంలో సేవాదారులతో కలిసి లెక్కింపు ప్రక్రియ చేపట్టామని పేర్కొన్నారు. 32 రోజుల హుండీ ఆదాయం నగదు రూపంలో రూ.3,69,35,18 కాగా బంగారం 000.075.200 మిల్లీగ్రాములు, వెండి 001.900.000 గ్రాములు వచ్చినట్లు తెలిపారు.

ఎస్సీ హాస్టల్‌ను పునః ప్రారంభించాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - హోళగుంద

ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో తహశీల్దార్ ఎస్.ప్రసాద్ రాజుకు వినతి పత్రం అందజేశారు. ఎఐఎస్ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీరంగ, మండల అధ్యక్ష, కార్యదర్శులు సతీష్ కుమార్, గాదిలింగ మాట్లాడారు. హోళగుందలో ఉన్న ఎస్సీ హాస్టల్‌ను ఆరేళ్ల మూసి వేశారని తెలిపారు. ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించడం లేదన్నారు. ఎఐఎస్ఎఫ్ నాయకులు శామ్యూల్, రాజ్, అజయ్ పాల్గొన్నారు.

సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు

- తహశీల్దార్ పద్మజ

ప్రజాశక్తి - చిప్పగిరి

విధులకు సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలని తహశీల్దార్ పద్మజ తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహణకు చిత్తూరు జిల్లా నుంచి చిప్పగిరికి వచ్చిన తహశీల్దార్ పద్మజ బదిలీ అయ్యారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో డిటి అజాద్ అహ్మద్, సీనియర్ అసిస్టెంట్ మధు స్వామి, రెవెన్యూ కార్యదర్శులు, సర్వేయర్లు పూలమాల, శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నికల విధులు నిర్వర్తించడానికి వచ్చిన తనకు సిబ్బందితోపాటు, మండలంలోని ప్రజా ప్రతినిధులు, ప్రజల మంచి సహకారం అందించారని, తాను ఎక్కడికి వెళ్లినా చిప్పగిరిని మరిచిపోనని తెలిపారు. మల్లికార్జున, తిమ్మప్ప, రంగన్న, పెద్దన్న, కిష్టప్ప, ఈరన్న, చంద్ర నాయక్, సునీత, సర్వేయర్ నారాయణ పాల్గొన్నారు.

గోనెగండ్ల : ఎన్నికల సమయంలో ఎన్నికల నియమావళిని అమలు చేసి విధులు నిర్వర్తించేందుకు చిత్తూరు జిల్లా కుప్పం నుంచి గోనెగండ్లకు వచ్చిన తహశీల్దార్ బి.పార్వతి బదిలీపై సొంత జిల్లాకు వెళ్లారు. తహశీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పూలమాల, శాలువాలతో ఆమెను సన్మానించి వీడ్కోలు పలికారు. మండలంలో ఎన్నికల నియమావళిని అమలు చేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినందుకు మండల ప్రజలకు రెవెన్యూ అధికారుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. డిటి లక్ష్మీ రాజా, ఆర్ఐ సుబ్బారెడ్డి, విఆర్ఒలు గంగావతి, అజయ్, ఉమర్, ఫరూక్, కిషోర్, రంగముని పాల్గొన్నారు.

చిప్పగిరిలో బదిలీ తహశీల్దార్ పద్మజను సన్మానిస్తున్న సిబ్బంది

గోనెగండ్లలో తహశీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

మాట్లాడుతున్న నాయకులు

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

- టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య కోరారు. సోమవారం మండలంలోని మరళి గ్రామంలో శుభ్‌దిన్ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు అందిస్తున్న భోజన వసతి గదిని, వంటలను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లను, బట్టలను పంపిణీ చేస్తోందని, విద్యార్థులకు మెరుగైన విద్య, సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, టిడిపి సీనియర్ నాయకులు చిన్న సిద్ధయ్య, లక్కే గోవిందు, కూటమి నాయకులు భూషణ్ గౌడ్, రామన్న గౌడ్, సర్పంచి, బూత్ ఇన్‌ఛార్జీ నాగభూషణ్ గౌడ్, మల్లయ్య, తిమ్మయ్య, రామన్న, కర్రెప్ప, నరసప్ప, రామాంజి, రాము, అమ్రేష్, రామన్న, వీరేష్, ముక్కన్న, బాబు పాల్గొన్నారు.

రైతులకు సాగునీటి ఇబ్బంది లేకుండా చూస్తాం

- టిడిపి నాయకులు రాఘవేంద్ర రెడ్డి, ఉల్లిగయ్య

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర దిగువ కాలువ కింద రైతులకు సాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తామని టిడిపి నాయకులు ఎన్.రాఘవేంద్ర రెడ్డి, చూడి ఉల్లిగయ్య తెలిపారు. సోమవారం కామవరం గ్రామ వద్ద మాధవరం మేజర్ డిస్ట్రిబ్యూటర్ కాలువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎల్ఎల్‌సి అధికారులతో చర్చించి రైతుల కోసం, శ్రావణ మాసోత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యం కోసం నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉరుకుంద ఈరన్న స్వామి భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగరాదని ఒకవారం ముందుగానే నీరు అందిస్తున్నట్లు తెలిపారు. రాజానగర్ శీను, రాజు, రెడ్డప్ప, ఉరుకుంద చిరంజీవి, పోతులయ్య, మహాదేవనాయుడు, కురుగోడు, నర్సప్ప, అయ్యప్ప, ఉస్సేని, కామవరం తిక్కయ్య, జాకీర్, రామలింగ, నబీ, అబ్దుల్, మర్రిస్వామి, కౌతాళం గిరి, గురు

విద్యార్థులకు యూనిఫారం అందజేస్తున్న నాయకులు

రుచికరమైన భోజనం అందించాలి

- ఎంఇఒ సావిత్రమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఎంఇఒ సావిత్రమ్మ మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారికి సూచించారు. సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో శిక్ష సప్తహ ఏడో రోజులో భాగంగా 'శుభదిన్' నిర్వహించారు. చిప్పగిరి పాఠశాలలో ఎంఇఒ సావిత్రమ్మ పాల్గొని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు స్వీట్ వంటకం చేయించి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్ష సప్తహ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని విద్యార్థులకు రోజూ ఒక కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ప్రతి పాఠశాలలో కూడా దాతలు ముందుకొచ్చి ప్రత్యేక వంటకాలు, స్వీటు లేదా స్పెషల్ రైస్, స్నాక్స్ లేదా పండ్లు కూడా అందించవచ్చని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-ఆలూరు

కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఇన్‌ఛార్జీ సిఐ మల్లికా తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడారు. ఆలూరులోని గుంతకల్లు, బళ్లారి ప్రధాన కూడలిలో టాటా ఇండికా విస్టా కారులో ఆలూరు కోయనగర్‌కు చెందిన బి.అశోక్ కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న 30 బాక్సుల మద్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. 30 బాక్సుల్లో 10 బాక్సులు అశోక్ తీసుకుని, మరో 20 బాక్సులు మొలగవల్లి గ్రామానికి చెందిన ఎరుకల సుధాకర్, కల్లపర్రి శ్రీనివాసులుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కారును, 30 బాక్సుల టెట్రా మద్యం స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విద్యుత్ అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీలోని కుబా మసీద్ పక్కన కొట్టంలో నివసిస్తున్న షబానా జనవరి 24న ట్రాన్స్‌కోకు రూ.4 వేలు విద్యుత్ మీటర్ కోసం చెల్లించినా విద్యుత్ మీటర్ ఇవ్వని విద్యుత్ అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడాలని సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు, బాధితులు, ఐద్వా నాయకులు ఎస్.షబానా కోరారు. సోమవారం విద్యుత్ ఎడిఇ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఒకవైపు పేదల ప్రభుత్వమని చెప్పుకున్నప్పటికీ అధికారులు వేధిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. మీటర్ విషయంపై ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి కూడా సిఫారసు చేశారన్నారు. గత ఆరు నెలలుగా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎడిఇ విషయాన్ని పరిశీలించి షబానా ఇంటికి మీటర్ ఇస్తామని హామీ ఇచ్చారు. ముంతాజ్, గౌసియా, మాబీ, సిఐటియు నాయకులు రాజు, ఉస్మాన్ వలీ, మాదన్న, చాంద్ బాషా, తాయప్ప, మక్బుల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య బలోపేతానికి ఉద్యమం

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వ విద్య బలోపేతానికి ఉద్యమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా తెలిపారు. దేశంలోనే విద్యలో వెనుకబడిన కర్నూలు జిల్లాలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని జరిగే ఎస్ఎఫ్ఐ 47వ జిల్లా ప్లినరీని జయప్రదం చేయాలని కోరారు. సోమవారం స్థానిక కెవిపిఎస్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలో ఆదర్శ పాఠశాలలు, గురుకులాలు, కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లలో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ప్రభుత్వ హాస్టల్‌లో సీట్లు రాక ప్రయివేట్ హాస్టళ్లలో రూ.లక్షల ఫీజులు కట్టి విద్యను అభ్యసించలేక తల్లిదండ్రులతో కలిసి దూర ప్రాంతాలకు వలసల వెళ్తున్నారని తెలిపారు. వాటిని ఆపడానికి అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతోందని చెప్పారు. ప్రజా ప్రతినిధులు కూడా విద్యార్థుల గురించి ఆలోచించడం లేదన్నారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విజయ్ కుమార్, నాయకులు రాము, అగ్గి రాముడు పాల్గొన్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION): ADONI.
I.A.No.183/2024 IN O.S.NO.39/2024.

Between:
Smt. M.Jaya. ...Petitioner.
Vs.
K.Padmakar. ...Respondent.

TO:
K. Padmakar S/O. K. Rudra Muni, Store Dealer, H.NO.8-259, Gowlipet, Adoni, Kurnool District.

Whereas the above named the petitioner filed a petition Under Order 38 Rule 5 and Section 151 CPC for attachment before Judgment. You are hereby directed to appear before this Honorable court on 29th day of August 2024 at 10-30 AM, either in person or your Advocate and file counter if any, falling which the matter will be decided in your absence and you will be set- ex-parte.

SHRI.L.K. SUNDAR SINGH
L.K. MANOJ SINGH
ADVOCATES FOR PLAINTIFF.
ADONI-518301

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION): ADONI.
O.S. NO.39/2024.

Between:
Smt. M.Jaya. ...Plaintiff.
Vs.
K.Padmakar. ...Defendant.

TO:
K.Padmakar S/O. K.Rudra Muni, Store Dealer, H.NO.8-259, Gowlipet, Adoni, Kurnool District.

Whereas the above named the Plaintiff filed the above suit against you for recovery of the suit amount. You are hereby directed to appear before this Honorable court on 29th August 2024 at 10-30 AM., either in person or your Advocate and file objections if any, failing which the matter will be decided in your absence and you will be set ex-parte.

SHRI.L.K. SUNDAR SINGH
L.K. MANOJ SINGH
ADVOCATES FOR PLAINTIFF.
ADONI-518301.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ.నెం.120/2023 ఇన్ ఐ.పి.నెం.14/2019

పి.మాసూమ్‌వలి. ...అర్జీదారు
-ఎదురు-
యస్.రియాజ్‌బాషా వగైరా. ...ప్రతివాదులు

2,12,15,16,17,రెస్పాండెంట్లకు ఆర్డర్ 9 రూలు 4 సి.పిసి ప్రకారం నోటీసులు

ఆర్.2 : మహబూబ్ బాష తండ్రి యస్.షేక్షావలి, ఇంటి.నెం.491/50ఎ-874-2-2, లక్ష్మినగర్, కల్లూరు (మం), కర్నూలు జిల్లా.
ఆర్.12 : జి.రాజ్‌కుమార్ రెడ్డి తండ్రి జి.క్రిష్ణరెడ్డి, ఇంటి.నెం.50, ఎండోమెంట్‌కాలనీ,కర్నూలు టౌన్.
ఆర్.15 : కె.నాగరాజు తండ్రి కె.తమ్మన్న, ఇంటి.నెం.81-250-1డి,శరీన్‌నగర్, కర్నూలు టౌన్.
ఆర్.16 : యస్.బాష తండ్రి యస్.ఖాశీం, నివాసం: జి.శింగవరం గ్రామము, కర్నూలు మండలం మరియు జిల్లా.
ఆర్.17 : పి.మహబూబ్ బాష తండ్రి పి.నన్నేసాహెబ్, ఇంటి.నెం.4/486, హుసేనాపురం గ్రామము, ఓర్వకల్లు మండలం, కర్నూలు జిల్లా.

పై నెంబరు అర్జీదారు అయిన పి.మాసూమ్‌వలి తండ్రి పి.సర్దార్‌మియా, ఇంటి.నెం. 49-50ఎ-87-60-1, లక్ష్మినగర్, కర్నూలు అనునతడు తనను దివాళాదారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో దావాళా అర్జీదాఖలు చేసినాడు. ఘనమైన కోర్టు వారు సదరు అర్జీ విచారించి ఐ.పి.నెం.14/2019గా నంబరు ఇచ్చినారు. కాని 13-6-2022 వ తేదిన కోర్టువారు బాట చెల్లించనందుకు ఈ కేసును డిస్‌మిస్ ఫర్ డిఫాల్టు క్రింద కేసును మూసివేసినారు. అర్జీదారు ఈ కేసును మరళ పునరుద్ధరించమని కోరుతూ అర్జీదాఖలు చేసినాడు. సదరు అర్జీని పరిశీలించి కోర్టువారు ఐ.ఎ.నెం.120/2023గా నెంబరు ఇచ్చినారు. ఘనమైన కోర్టు వారు ఈ కేసును మరళ పునరుద్ధరించమని కోరుతూ మరియు ఐ.ఎ.నెం.120/2023 నంమరులో 2,12,15,16,17 రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 21-8-2024వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టువారి ఉత్తర్వుల మేరకు
వాయిదా :21-8-2024

యం.మురళిమోహన్‌రెడ్డి,
యం.పుష్పలలితమ్మ,
జి.రాజేష్‌గౌడ్,
అర్జీదారు పరం అడ్వకేట్లు,
కర్నూలు.
మొబైల్.నెం.9440244845

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ.నెం.119/2023 ఇన్ ఐ.పి.నెం.14/2019

పి.మాసూమ్‌వలి. ...అర్జీదారు
-ఎదురి-
యస్.రియాజ్‌బాషా వగైరా. ...ప్రతివాదులు

2,12,15,16,17,రెస్పాండెంట్లకు సెక్షన్ 5 లిమిటేషన్ యాక్ట్ ప్రకారం నోటీసులు

ఆర్.2 : మహబూబ్ బాష తండ్రి యస్.షేక్షావలి, ఇంటి.నెం.491/50ఎ-874-2-2, లక్ష్మినగర్,కల్లూరు (మం),కర్నూలు జిల్లా.
ఆర్.12 : జి.రాజ్‌కుమార్ రెడ్డి తండ్రి జి.క్రిష్ణరెడ్డి, ఇంటి.నెం.50,ఎండోమెంట్‌కాలనీ, కర్నూలు టౌన్.
ఆర్.15 : కె.నాగరాజు తండ్రి కె.తమ్మన్న, ఇంటి.నెం.81-250-1డి,శరీన్‌నగర్, కర్నూలు టౌన్.
ఆర్.16 : యస్.బాష తండ్రి యస్.ఖాశీం, నివాసం: జి.శింగవరం గ్రామము, కర్నూలు మండలం మరియు జిల్లా.
ఆర్.17 : పి.మహబూబ్ బాష తండ్రి పి.నన్నేసాహెబ్, ఇంటి.నెం.4/486,హుసేనాపురం గ్రామము, ఓర్వకల్లు మండలం,కర్నూలు జిల్లా.

పై నెంబరు అర్జీదారు అయిన పి.మాసూమ్‌వలి తండ్రి పి.సర్దార్‌మియా, ఇంటి.నెం. 49-50ఎ-87-60-1, లక్ష్మినగర్, కర్నూలు అనునతడు తనను దివాళాదారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో దావాళా అర్జీదాఖలు చేసినాడు. ఘనమైన కోర్టు వారు సదరు అర్జీ విచారించి ఐ.పి.నెం.14/2019గా నంబరు ఇచ్చినారు. కాని 13-6-2022 వ తేదిన కోర్టువారు బాట చెల్లించనందుకు ఈ కేసును డిస్‌మిస్ ఫర్ డిఫాల్టు క్రింద కేసును మూసివేసినారు. అర్జీదారు ఈ కేసును మరళ పునరుద్ధరించమని కోరుతూ అలాగే కోర్టువారు ఇచ్చిన 30 రోజులు గడువు అయిపోయి నందున అర్జీని 270 రోజుల ఆలస్యముగా దాఖలు చేసినాడు. సదరు అర్జీని పరిశీలించి కోర్టువారు ఐ.ఎ.నెం.119/2023గా నెంబరు ఇచ్చినారు. ఘనమైన కోర్టు వారు సదరు ఆలస్యమును మన్నించమని కోరుతూ మరియు ఐ.ఎ.నెం.119/2023 నంబరులో 2,12,15,16,17 రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 21-8-2024 వతేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టువారి ఉత్తర్వుల మేరకు
వాయిదా : 21-8-2024

యం.మురళిమోహన్‌రెడ్డి,
యం.పుష్పలలితమ్మ,
జి.రాజేష్‌గౌడ్,
అర్జీదారు పరం అడ్వకేట్లు,
కర్నూలు.
మొబైల్.నెం.9440244845